క్లుప్తంగా

ఘనంగా గంగాలమ్మ ఉత్సవ ఊరేగింపు



వెలగదుర్రులో గంగాలమ్మ జాతరలో ఆసాదుల నృత్యాలు

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో గంగాలమ్మ జాతర ఉత్సవ ఊరేగింపు బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి గ్రామోత్సవంలో అసాదుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, త్రీన్‌మార్లతో అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెరవలి: ట్రీ కటింగ్ కోసం స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

దేవరపల్లి: యర్నగూడెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని యర్నగూడెం, త్యాజంపూడి, గాంధీనగరం, సంగాయగూడెం ఫీడర్లపై గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ సర్వీసులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

ట్రీ కటింగ్ కోసం..

నల్లజర్ల: ఈనెల 24వ తేదీ గురువారం గుండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సీతారామపురం ఫీడర్‌లో ట్రీకటింగ్ నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుండేపల్లి, తూర్పుచోడవరం పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణం అప్పారావు తెలిపారు. సీతారామపురం ఫీడర్‌లో త్రీఫేజ్ సప్లయి ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇవ్వనున్నట్టు చెప్పారు.

ప్రజాస్వామ్య విలువలపై వ్యాసరచన పోటీలు



తాళ్లపూడి జెడ్పీ స్కూల్‌లో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

తాళ్లపూడి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం ఓటర్లు-ప్రజాస్వామ్య విలువలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తాళ్లపూడి ఉన్నత పాఠశాల వద్ద కొవ్వూరు నియోజకవర్గ స్వీప్ కో-ఆర్డినేటర్, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం నియోజకవర్గ స్థాయిలో పోటీ నిర్వహిస్తారని ఆయన చెప్పారు. ప్రతి స్కూల్ నుంచి తొలి మూడు స్థానాలు పొందిన విద్యార్థులు గురువారం కొవ్వూరులోని ఏబీఎన్ డిగ్రీ కాలేజీలో జరిగే నియోజవర్గ స్థాయి పోటీకి హాజరుకావాలని తెలిపారు. హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రవీణ్, రాజకుమారి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ కుట్ర



చాగల్లులో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

చాగల్లు: దేశంలో రాజ్యాంగాన్ని మార్చే ప్రక్రియకు బీజేపీ పూనుకుందని, ఆర్ఎస్ఎస్ భావజాలంతో కూడిన రాజ్యాంగాన్ని తీసుకురావడానికి కుట్ర చేస్తోందని ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభానికి బుధవారం ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయటానికి పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీకి పూర్వ వైభవం తేవడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని, ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. పార్టీ నేతలు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

సంకంట కాలం

- ఇటుక బట్టీలతో పొంచి ఉన్న ప్రాణాపాయం
- ముడి సరకులు కళ్లల్లో పడి ఆస్పత్రుల పాలవుతున్న ప్రయాణికులు
- అధికారులకు కాసులు.. ప్రజలకు పాట్లు
- రోడ్డు ప్రమాదాలకు కారణం బట్టీలేనని విమర్శలు

పెరవలి: రోడ్డు పక్కన వెలసిన ఇటుక బట్టీలు వాహనదారులకు, బాటసారులకు ప్రాణ సంకటంగా మారాయి. రహదారుల పక్కనే వీటిని ఏర్పాటు చేయడం వలన ఇటుక తయారీకి ఉపయోగించే ముడి సరకులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే నల్లబూడిద, రాక్షస బొగ్గు, ఊక వేయడం వలన, అవి గాలికి ఎగిరివచ్చి వాహనదారుల కళ్లల్లో పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిత్యం జాతీయ, ఆర్అండ్‌బీ రహదారులపై ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు కన్నీరు కారుస్తూ ఇళ్లకు చేరుతున్నారు. కంటిలో పడిన బూడిదతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరవలి మండలంలో 46 ఇటుక బట్టీలున్నాయి. పెరవలి, ఉసులుమర్రు, కానూరు, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి. ఈ బట్టీలన్నీ జనావాసాలకు దగ్గరగాను, జాతీయ, ఆర్అండ్‌బీ రహదారుల పక్కనే ఏర్పాటు చేయడంతో ప్రజల పాట్లు ఇన్నీఅన్నీ కావు. రహదారుల పక్కన ఉన్న ఇటుక బట్టీల యజమానులు రోడ్ల మార్జిన్లను కూడా తవ్వి, ఇటుక ఆవలను రోడ్డుకు ఆనుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఆవను కాల్చే సమయంలో పొగ, బూడిద ఎగిరివచ్చి వాహనదారుల కళ్లల్లో పడటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం గాలి వీచినా వాహనదారులు బూడిదమయం అవుతున్నారు. ముడి సరకుపై బరకాలు కప్పి నిల్వ చేయాలనే నిబంధనలున్నా, బట్టీ యజమానులు వాటిని గాలికి వదిలేయడంతో ప్రజలకు శాపంగా మారింది.

నిబంధనలు ఇలా..

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం గ్రామానికి దూరంగా బట్టీలను ఏర్పాటు చేయాలి. రహదారికి 200 మీటర్ల దూరంలో ఆవలు ఉండాలి. ఇటుక బట్టీలకు వినియోగించే ముడి సరకులపై బరకాలు కప్పి ఉంచాలి. రాక్షస బొగ్గు, ఊక బూడిద, నల్ల బూడిద వంటి వాటిని ప్రతి రోజు నీటితో తడపాలి. ఆయా నిబంధనలు కచ్చితంగా పాలించాల్సి ఉన్నా, ఎవరూ అమలు చేయడం లేదు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల పాట్లు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి.

ఫిర్యాదులు చేసినా..

ఇటుక బట్టీలతో ఇబ్బందులు పడుతున్నామని గతంలో కడింపాడు, పిట్టల వేమవరం గ్రామాల ప్రజలు గ్రామ స్థాయి నుండి కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా, ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కేవలం మూడు కి.మీ. పరిధిలోనే 20 బట్టీలు జాతీయ, ఆర్అండ్‌బీ రహదారి పక్కనున్నాయి. ఆయా బట్టీలను తొలగించాలని గతంలో ఫిర్యాదులు చేసినా, పంచాయతీ, పొల్యూషన్, సేల్ ట్యాక్స్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై ఆయా గ్రామాల కూడళ్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలకు ఇటుక బట్టీలు కూడా కారణమంటున్నారు.



కడింపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఇటుక ఆవ, రాక్షసి బొగ్గు



పిట్టల వేమవరం వద్ద జాతీయ రహదారి పక్కన తీసిన పచ్చి ఇటుక, ఊక



వడలి-ముక్కామల ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఇటుక ఆవ, పుల్లలు



మల్లేశ్వరం వద్ద జాతీయ రహదారిపైనే నల్లబూడిద గుట్ట, ఇటుక ఆవలు

భయం వేస్తోంది



పెరవలి మండలంలో రహదారులపై ప్రయాణించాలంటే భయం వేస్తోంది. అసలే వాహనాల వేగానికి హడలిపోతుంటే, ఇప్పుడు ఈ ఇటుక బట్టీల వలన దుమ్ము, ధూళి కళ్లలో పడి అవస్థలు పడుతున్నాం. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దుమ్ము, ధూళి వలన మోటార్ సైకిల్‌పై ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తోంది.

– టి.అంజిబాబు, ప్రయాణికుడు, తణుకు

ఆస్పత్రులకు వెళ్లాం



రోడ్డుపై నడిచి రాలేకపోతున్నాం. ఎప్పుడూ గాలికి దుమ్ము ఎగురుతూనే ఉంటుంది. నల్ల బూడిద కళ్లలో పడి ఎన్నోసార్లు ఆస్పత్రులకు వెళ్లాం. ఇటుక బట్టీల నుండి వచ్చే పొగ వలన, బూడిద కంట్లో పడటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బోకే వెంకటేశ్వర్లు, ప్రయాణికుడు, ఖండవల్లి

డ్రోన్ సాయంతో కషాయాల పిచికారీ



పెద్దేవంలో కషాయాల పిచికారీకి డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దేవంలో బుధవారం డ్రోన్ సాయంతో నూతన సాంకేతిక విధానంలో కషాయాల పిచికారీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో 32 మంది రైతులకు చెందిన 53 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ కషాయ ద్రావణాలను వరి పంటలపై పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి మహారాణి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు డ్రోన్ వినియోగం

నిడదవోలు రూరల్: ప్రకృతి వ్యవసాయ విస్తరణకు డ్రోన్‌ను వినియోగిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని కోరుమామిడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కషాయాలను, ద్రావణాలను వరి పంటలపై డ్రోన్ సాయంతో బుధవారం పిచికారీ చేయించారు. వరి పంటపై పురుగులు, తెగుళ్ల నియంత్రణకు వేప గింజల ఇంగువ, కుంకుడు చాప, బెల్లం కషాయాలను వినియోగించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ అధికారి వెంకట్రావు, రైతులు కానుబోయిన శేషు, సూర్యవతి, సత్య, రూప తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు మండలం కోరుమామిడిలో డ్రోన్‌తో పిచికారీ కోసం ఏర్పాట్లు చేస్తున్న రైతులు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎల్‌డీఓ శ్రీవారెడ్డి

పెరవలి: ఉపాధి హామీ పథకంలో జరిగే పనులు వేగంగా చేపట్టాలని, ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని డీఎల్‌డీఓ శ్రీవారెడ్డి హెచ్చరించారు. పెరవలి మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 39 సీసీ రోడ్లు మంజూరు కాగా, వీటిలో 30 పూర్తయ్యాయని చెప్పారు. అలాగే 12 డ్రెయిన్లు మంజూరు కాగా, 8 పూర్తి చేశారని, మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. గోకుల షెడ్లపై ఎవరూ శ్రద్ధ వహించటం లేదని, 43 మంజూరైతే.. ఇప్పటికి 27 నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఇందులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతలు తవ్వటానికి 39 మంజూరైతే, ఇప్పటివరకు 6 పనులు చేపట్టారని, సిబ్బంది ఎందుకు నిర్లిప్తంగా ఉన్నారని ఆగ్రహించారు. ఉపాధి కూలీలకు రోజుకు 1,500 మందికి పని కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశిస్తే, కేవలం 300 మందికి మాత్రమే పని కల్పిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి అన్ని పనుల్లో ప్రగతి కనిపించకపోతే, ఇబ్బందులు పడాల్సి వస్తోందని హెచ్చరించారు. కొత్త పనులు గుర్తించి, అనుమతులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ బి.రాంప్రసాద్, ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, ఏపీఓ సత్యనారాయణ, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

హెచ్ఎం సాయిచంద్ర మృతికి ఏపీటీఎఫ్ నివాళి



వేగేశ్వరపురంలో సాయిచంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం మండల పరిషత్ జూనియర్ బేసిక్ పాఠశాల హెచ్ఎం తైలం సాయిచంద్ర ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో ఏపీటీఎఫ్ మండల నాయకులు బుధవారం వేగేశ్వరపురంలోని ఆమె ఇంటికెళ్లి సాయిచంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ, ఆమె ఆకస్మిక మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటన్నారు. ఆమె కుటుంబానికి ప్రసాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు పి.రఘువీరశాస్త్రి, ప్రతినిధులు యాదం శంకరం, రాజారత్నం, కనకదుర్గ, జీవీకే రాజు, పూనెం వెంకట కృష్ణమోహన్, గొల్లపల్లి కృష్ణ, తదితరులున్నారు.

నీటి విడుదల క్రమబద్ధీకరణ

పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు

నిడదవోలు: గోదావరి డెల్టా పరిధిలో రబీ పంటలో వరినాట్లు పూర్తి కావడంతో రైతుల సాగునీటి అవసరాల మేరకు జల వనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా కాలువలకు సాగునీటి విడుదలను తగ్గించారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుండి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు గురువారం 5,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, బుధవారం 800 క్యూసెక్కులు తగ్గించి 5 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. అదేవిధంగా తూర్పు డెల్టాకు 2,875 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 1,870 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో నరసాపురం కాలువకు 1,843 క్యూసెక్కులు, ఏలూరు కాలువలకు 987, తణుకు కాలువకు 1,200, అత్తిలి కాలువలకు 326 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.



నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

గర్భిణులకు ఆకుకూరల పంపిణీ

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ వాటికలను ఏర్పాటు చేసి సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ధుమంతునిగూడెం, కొత్తగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు బుధవారం పోషణ వాటిక వద్ద సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి ఆకుకూరలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గోపాలపురం డివిజన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 172 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ వాటికలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అన్ని వాటికల్లో ఆకుకూరలు, కాయకూరలు పండించినట్టు ఆయన వివరించారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో పంటలు పండించినట్టు ఆయన తెలిపారు. తోటకూర, గోంగూర, బచ్చలి, కొత్తిమీర, పాలకూర, ముల్లంగి, మెంతికూర పండించినట్టు ఆయన తెలిపారు. ప్రతి ఇంటి వద్ద పెరటి పంటలు పండించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి నరేంద్ర, గుడిసె పోసి వెంకటరత్నం, అయినాల నరసింహమూర్తి, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలో గర్భిణులకు ఆకుకూరలను అందజేస్తున్న సర్పంచ్ రామలక్ష్మి

తాడిపూడి సర్పంచ్‌కు పితృ వియోగం



నామా కృష్ణ(ఫైల్)

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడి సర్పంచ్ నామా గోపాలం(శ్రీనివాస్) తండ్రి నామా కృష్ణ(72) మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాళ్ల బాబురావు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, నాయకులు కొల్లి దుర్గారావు, ఏలీయా తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నామా కృష్ణ మృతికి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కార్ల వెంకటేశ్వరరావు, కొమ్మిరెడ్డి పరశురామారావు, తోట రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, వల్లభశెట్టి శ్రీనివాస్, పలువురు సర్పంచ్‌లు సంతాపం తెలిపారు.

పాలంగిలో పశువైద్య శిబిరం



పాలంగిలో పశువులకు మందులు వేస్తున్న సిబ్బంది



చిట్యాలలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డీడీ సత్యనారాయణ

ఉండ్రాజవరం: ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పి.శ్రీనివాసవర్మ అన్నారు. మండలంలోని పాలంగిలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 37 పశువులకు, కోళ్లకు పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గోపాలపురం: పశువుల పంపకం దారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. గోపాలపురం మండలం చిట్యాలలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు చెన్నకేశవులు, వెంకటరెడ్డి, ఎం.దారిన్ బాబు, జి.సోమేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, పాడి రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు పశువుల సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు.

అతివేగం ప్రమాదాలకు మూలం

కొవ్వూరు: వాహనాల ఓవర్ టేకింగ్, అతివేగం ప్రమాదానికి కారణమవుతున్నాయని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.శివప్రసాద్ అన్నారు. ఆంధ్రా సుగర్స్ కర్మాగారంలో బుధవారం సాయంత్రం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఫ్యాక్టరీ సమావేశ మందిరంలో డ్రైవర్లతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనారోగ్యంగా ఉన్న సమయంలో వాహనాలు నడపడం మంచిది కాదన్నారు. వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించకపోవడం, సెల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదాలకు మూలమన్నారు. కర్మాగారం భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ఎంవీఐ వి.లక్ష్మీప్రవీణ, ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు మాట్లాడుతూ, వాహనాల డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీజీఎం పర్సనల్ సీహెచ్ సుఖమహర్షి, ఆటో మొబైల్ ఇంజినీర్ డి.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

గోపాలపురం: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని జనసేన మహిళా నాయకురాలు ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లమూడి క్రాంతి అన్నారు. బుధవారం గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, పోశిన గణపతి, వడ్డి రామలీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

దేవరపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణం రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని కార్మికులు తెలిపారు. చట్టాలకు వ్యతిరేకంగా బుధవారం దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో క్వారీ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ రమేష్, పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమల విక్రయాలను ఆపాలని, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత కార్మికులుగా క్రమబద్ధీకరించాలని, మోటారు, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు గంటా నూకరాజు, గోపి, ఆంజనేయులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో ఆందోళన చేస్తున్న క్వారీ కార్మికులు

పెన్షన్‌దారుల వెరిఫికేషన్

ఉండ్రాజవరం: మండలంలో మొత్తం 76 మంది పెన్షన్ లబ్ధిదారులకు వెరిఫికేషన్ నిర్వహించినట్లు ఎంపీడీవో వి.రామారావు బుధవారం తెలిపారు. బెడ్ రిడెన్ (మంచానికి పరిమితమైన) రూ.15 వేల పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారుల ధ్రువీకరణ కోసం మూడు టీంలు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలో రెండు, వేలివెన్ను పీహెచ్‌సీ పరిధిలో ఒక టీమ్ కాకినాడ జీజీహెచ్ డాక్టర్లతో కలసి, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరించినట్లు తెలిపారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి



గోపవరంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు ఎనలేని సేవలు చేశారని హెచ్ఎం గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గోపవరం ఎంపీయూపీ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విషజ్వరం కారణంగా 1940 జనవరి 22న ఆయన మృతి చెందారన్నారు. ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఫణికుమార్‌శర్మ, కాశీవిశ్వేశ్వరరావు, సీఆర్పీ కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు అంతర్జాతీయ అవార్డు

నిడదవోలు: ప్రముఖ మల్టీ నేషనల్ మెడికల్ కంపెనీలో పనిచేస్తున్న నిడదవోలు పట్టణానికి చెందిన కీర్తి లోకేష్‌కు దేశంలోనే బెస్ట్ సేల్స్ పెర్ఫార్మర్‌గా ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఇటీవల మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన కంపెనీ అంతర్జాతీయ సమావేశంలో లోకేష్‌కు ఈ అవార్డు అందజేశారు. దేశ స్థాయిలో ఉత్తమ సేల్స్ పెర్ఫార్మర్‌గా నిలిచిన లోకేష్‌ను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.